క్లుప్తంగా

ప్రోత్సాహక బహుమతుల అందజేత



విద్యార్థినికి నగదు బహుమతి అందజేస్తున్న ఎంఈఓ, మానవత సంస్థ సభ్యులు

ద్వారకాతిరుమల: స్థానిక శ్రీశ్రీనివాస కళాశాలలో మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ నెలవారీ సమీక్షా సమావేశం ఆ సంస్థ మండల అధ్యక్షుడు దేవరపల్లి రాయుడు బాబు అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా మానవత కార్యక్రమాలపై సభ్యులు చర్చించారు. అనంతరం మండలంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతిలో స్కూల్ ఫస్ట్ వచ్చిన విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్లు, ఒక్కో విద్యార్థికి ప్రోత్సాహక బహుమతిగా రూ.వెయ్యి అందించారు. వీటిని ఎంఈఓ పరసా వెంకట్రావు, మానవత సంస్థ సభ్యుల చేతుల మీదుగా అందజేశారు.

పహల్గాం దోషులను కఠినంగా శిక్షించాలి



ముస్లింలతో కలిసి సహపంక్తి భోజనం చేస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి రవి

టి.నరసాపురం: పహల్గాంలో అనేక మంది ప్రాణాలు బలి తీసుకున్న ఉగ్ర మూకలను కఠినంగా శిక్షించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ టి. నర్సాపురంలోని మసీదు వద్ద ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం రక్షణ వ్యవస్థను గాలికి వదిలేసిందని, అందుకే ఉగ్రమూకలు చొరబడ్డాయన్నారు. మరోపక్క వక్ఫ్ సవరణ చట్టం ద్వారా వక్ఫ్ ఆస్తులను దోచుకోవటానికి ప్రయత్నిస్తుందని, బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలతో దేశ ప్రజలకు అశాంతిని సృష్టించడమే పనిగా పెట్టుకుందని విమర్శించారు. అనంతరం ముస్లిం పెద్దలతో కలసి సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు అనుమల మురళి, గుడెల్లి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

చదరంగంలో విద్యార్థుల ప్రతిభ



ఎమ్.కుషాంక్ శ్రీ విశ్వ



వై.వర్షిత్ రాజ్

జంగారెడ్డిగూడెం: ఏలూరులో నిర్వహించిన జిల్లాస్థాయి ఓపెన్ చదరంగం పోటీల్లో జంగారెడ్డిగూడెం చిన్నారులు ప్రతిభ చూపారు. ఈ పోటీల్లో స్థానిక దివ్యాస్ మాస్టర్స్ చెస్ అకాడమీలో శిక్షణ పొందుతున్న ఎమ్.కుషాంక్ శ్రీ విశ్వ 5వ స్థానాన్ని కైవసం చేసుకోగా, అండర్-13 బాలురు విభాగంలో వై.వర్షిత్ రాజ్ ద్వితీయ స్థానం సాధించాడు. విజేతలను చెస్ కోచ్ అండ్ డైరెక్టర్ అయినపర్తి సరళామాధవి, అయినపర్తి చంద్రశేఖర్ మాస్టారు, తల్లిదండ్రులు అభినందించారు.

బాలికకు ఆర్థిక సహాయం



ఆర్థిక సహాయం చేస్తున్న మానవత సభ్యులు

కొయ్యలగూడెం: అనారోగ్యంతో బాధపడుతున్న బాలికకు ఆరోగ్య చికిత్స నిమిత్తం ఆదివారం మానవత సంస్థ సభ్యులు రూ.8 వేల ఆర్థిక సహాయం అందజేశారు. కొయ్యలగూడెంకి చెందిన కంచర్ల రాజేష్ కుమార్తె జీబీఎస్ అనే కొత్త వైరస్‌తో బాధ పడుతుంది. ప్లాస్మా థెరపి చేయాలనీ, సుమారు రూ. 12 లక్షల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారు. దాతలు ముందుకు వచ్చి బాలిక ఆరోగ్యానికి నగదు సహాయం అందజేయాలని మానవత సంస్థ అధ్యక్షుడు మాటూరు సుధీర్, సభ్యులు కోరారు.

మాదకద్రవ్య రహిత రాష్ట్రంగా మార్చాలి

పెదవేగి: రాష్ట్రాన్ని మాదకద్రవ్య రహిత రాష్ట్రంగా మార్చే లక్ష్యంతో పోలీస్‌శాఖ పనిచేస్తుందని ఏలూరు జిల్లా అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు అన్నారు. మాదక ద్రవ్యాల వాడకం వల్ల కలిగే నష్టాలపై పినకడిమిలోని డి పాల్ విద్యా సంస్థల విద్యార్థులకు ఆదివారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మాదక ద్రవ్యాల వాడకం వల్ల తల్లిదండ్రుల ఆశలు కలలుగా మిగిలిపోతాయని, యువత భవిష్యత్ అంధకారమవుతుందని వివరించారు. డ్రగ్స్, మాఫియా ముఠాలను అరికట్టడంలో ప్రజలు పోలీస్ శాఖకు సహకరించాలన్నారు. ఎవరైనా మత్తు పదార్థాలు విక్రయిస్తుంటే తెలియజేయాలని.. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని చెప్పారు.

పంటలకు రక్ష.. భూసార పరీక్ష

- రైతు సేవా కేంద్రాల సహాయంతో భూసార పరీక్షలు
- మట్టి నమూనా సేకరణకు ఇదే అనువైన సమయం



బుట్టాయగూడెం మండలం అలివేరులో మట్టి నమూనాను సేకరిస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: ఇష్టానుసారం పంటలను సాగు చేస్తుండడంతో పొలాల్లో భూసారం తగ్గి పంట దిగుబడులు తగ్గిపోతున్నాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఎరువులను అధికంగా వాడకుండా ఉండేందుకు, పొలాల్లో భూసారం పెంచేందుకు భూసార పరీక్షలు తప్పనిసరి అని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. భూసార పరీక్షల వలన పొలాల్లో ఏ మేరకు ఏ ఎరువులను, సూక్ష్మ పోషకాలను వినియోగించుకోవాలో తెలుస్తుందని, దీని ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చునని చెబుతున్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో భూసార పరీక్షలను నిర్వహించే దిశగా అధికారులు కృషి చేస్తున్నారు. ఇప్పటికే సుమారు 2800 వరకూ భూసార పరీక్షలు నిర్వహించినట్లు అధికారులు చెబుతున్నారు.

మట్టి సేకరించాల్సింది ఇలా..

చౌడు, ఆమ్ల నేలల్లో, ఇతర ఏ సమస్యాత్మక నేలల్లోనైనా వేరువేరుగా మట్టి నమూనాలు సేకరించాలి. 15-30 సెంటీమీటర్ల లోతులో మట్టి నమూనాలు సేకరించాలి. ఎటువంటి చెత్త ఉన్నా వాటిని తొలగించి వి ఆకారంలో గుంట తీసుకోవాలి. ఒకే మందంలో పైనుంచి కింద వరకూ పల్చగా పొర్లగా తీసుకుని మట్టి సేకరించాలి. జిగ్‌జాగ్ పద్ధతిలో ఒక ఎకరాకు 8 నుంచి 10 చోట్ల 2 కిలోల మట్టిని సేకరించాలి. దీనిని ఒక గోనుపై వేసుకుని నీడలో ఆరబెట్టి ఏదైనా మట్టి గడ్డలు ఉండే వాటిని చిదిమేయాలి. తర్వాత దానిని నాలుగు భాగాలుగా చేసుకుని ఒక్కో భాగం నుంచి కొంత మట్టిని తీసుకుని ఒక కిలో మట్టిని తయారు చేసి నమూనాకు తీసుకోవాలి. వేసే పంటను బట్టి నమూనా సేకరణ మారుతుంది. స్వల్పకాలిక పంటలకు 15/20 సెంటీమీటర్ల లోతు తీయాలి. తోట పంటలకు 3/4 అడుగులు తీయాలి.

స్థూల, సూక్ష్మ పోషకాల లోపాలను గుర్తించాలి

మట్టి నమూనాలు పరీక్షలు చేసిన తర్వాత భూసార పరీక్షా ఫలితం ఆధారంగా స్థూల, సూక్ష్మ పోషకాల విలువను తెలియజేస్తూ వాటి ఆధారంగా రైతులకు సిఫార్సు చేయడం జరుగుతుంది. ప్రతిరైతు సాగు చేసే పంటల్లో స్థూల, సూక్ష్మ పోషకాలు లోపించకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి. స్థూల, సూక్ష్మ పోషకాలుగా పిలవబడే నత్రజని, భాస్వరం, పొటాష్, జింక్, బోరాన్, సల్ఫర్, కాల్షియం, మెగ్నీషియమ్, జిప్సమ్‌లు పంటల్లో లోపిస్తే దిగుబడులు గణనీయంగా తగ్గుతాయి. ఈ లోపాన్ని గుర్తించి సకాలంలో వాటిని వేసుకుని దిగుబడిని పెంచుకోవచ్చని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. పోషకాల లోపాలను నివారించడానికి జిప్సమ్, జింక్, పచ్చిరొట్ట ఎరువులను సాగులో తీసుకురావాలి. ప్రతిరైతు తమ పొలాల్లో స్థూల, సూక్ష్మ పోషకాల లోపాలను గుర్తించి అందుకు అనుగుణంగా తగు చర్యలు తీసుకోవడం మంచిదని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

ఆ మట్టి తీయరాదు

- భూసార పరీక్షలకు సంబంధించి పొలం గట్టు పక్కన మట్టిని తీయకూడదని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.
- అలాగే నీటి ముంపు ఉన్న దగ్గర, చెట్ల నీడ, చెట్ల వేరు ఉన్న చోట మట్టి నమూనా తీయకూడదు.
- సేంద్రియ వ్యవసాయానికి ఎరువులు వేసిన తర్వాత కూడా నమూనాలు సేకరించకూడదు. సేంద్రియ, రసాయనిక ఎరువులు వేసిన 50 రోజుల తర్వాత మట్టి నమూనాలు సేకరించాలి.

భూసార పరీక్షలు తప్పనిసరి



మట్టి నమూనాల సేకరణకు అనువైన సమయం ఇదే. రైతు సేవా కేంద్రాల సాయంతో భూసార పరీక్షలు చేయడం జరుగుతుంది. భూసార పరీక్షలకు అనువైన మట్టి నమూనాను మాత్రమే సేకరించాలి. భూసారాన్ని గుర్తించి వాటికి అనుగుణంగా ఉండే ఎరువుల వాడకంపై సూచనలు ఇవ్వడం జరుగుతుంది. భూసారం పెరగడం వలన ఎరువుల వాడకం, ఖర్చు తగ్గుతాయి.

– డి. ముత్యాలరావు, మండల వ్యవసాయాధికారి, బుట్టాయగూడెం మండలం

శివపార్వతులకు పల్లకీసేవ

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని శ్రీ పంచభూత మరకత లింగేశ్వర సహిత శ్రీ చక్ర సమన్విత శ్రీ విజయ దుర్గ అమ్మవారి ఆలయంలో మాస శివరాత్రి పురస్కరించుకుని ఆదివారం శివపార్వతులకు పల్లకీసేవ నిర్వహించారు. మేళతాళాలు, సన్నాయి వాయిద్యాల నడుమ పట్టణ పురవీధుల్లో శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఊరేగించారు. ఆలయ శాశ్వత కమిటీ చైర్మన్ మారిశెట్టి రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి మాడా రామ్మోహనరావు, అర్చకులు సుదర్శనం వేణుగోపాలాచార్యులు, సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి వేసవి విజ్ఞాన శిబిరం

జంగారెడ్డిగూడెం: స్థానిక శాఖా గ్రంథాలయంలో సోమవారం నసుంచి జూన్ 6 వరకు వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహిస్తున్నట్టు గ్రంథాలయ అధికారి పి దుర్గారావు తెలిపారు. సమ్మర్ క్యాంప్ 2025 కార్యక్రమంలో భాగంగా విద్యార్థినీ విద్యార్థులకు విజ్ఞానాన్ని పెంపొందించేందుకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. స్పోకెన్ ఇంగ్లీష్, చెస్, డ్రాయింగ్, డాన్స్, క్రాఫ్ట్ వర్క్‌పై శిక్షణ ఇస్తామని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శ్రీవారి సేవలో రాష్ట్ర గనుల శాఖ మంత్రి కొల్లు

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని రాష్ట్ర గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు, రాష్ట్ర అంగన్‌వాడీల విభాగం అధ్యక్షురాలు ఆచంట సునీత, మాజీ మంత్రి పీతల సుజాత ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు వారికి శ్రీవారి శేష వస్త్రాలను కప్పి వేద ఆశీర్వచనాన్ని పలుకగా, ఆలయ డీఈఓ బాబురావు స్వామివారి జ్ఞాపికలను, ప్రసాదాలను అందజేశారు.

రాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు

పెదవేగి : మండలంలోని రాట్నాలకుంట గ్రామంలో వెలసిన శ్రీ రాట్నాలమ్మ తల్లికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా భక్తులు మాత్రం పరిమి త సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రతి ఆదివారం జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు బారులుతీసేవారు. అయితే అమావాస్య కావడంతో భక్తుల తాకిడి తగ్గిందని దేవస్థాన నిర్వాహకులు చెప్పారు.

నేటి నుంచి ప్రతిష్ఠా మహోత్సవాలు



రామాలయంలో ప్రతిష్ఠించనున్న దేవతామూర్తుల విగ్రహాలు

కొయ్యలగూడెం: శ్రీ పట్టాభి సీతారామ లక్ష్మణ ఆంజనేయ సమేత వినాయక ధ్వజ తయానిహిక ప్రతిష్ఠా మహోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమై మూడు రోజులపాటు కొనసాగనున్నాయి. గవరవరం (వెంకయ్య పాలెం)లో ఉన్న రామాలయంలో ఈనెల 30వ తేదీ ఉదయం 7.26 గంటలకు విగ్రహాలు ప్రతిష్ఠించనున్నారు. బ్రహ్మశ్రీ మామిళ్ళపల్లి ఆనంద శివాచార్య పర్యవేక్షణలో ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు సిద్ధం చేశారు. 28వ తేదీ గణపతి పూజ, ధ్వజారోహణం, మండపారాధనతో ప్రతిష్ఠకు సంబంధించిన ప్రత్యేక పూజలు హోమాలు నిర్వహించనున్నారు. దివంగత గారపాటి గంగరాజు, సీతమ్మ దంపతుల జ్ఞాపకార్థం వారి వారసులు నూతన విగ్రహాలను ఆలయానికి బహుకరించారు. గవరవరం, వెంకయ్యపాలెం గ్రామస్తుల ఆధ్వర్యంలో ప్రతిష్ఠాపన కార్యక్రమాలు నిర్వహిస్తారు.

ఏపీ హెచ్‌ఏఎంఎస్‌ఏ పశ్చిమగోదావరి అసోసియేషన్ నూతన కార్యవర్గం



ఏపీ హెచ్‌ఏఎంఎస్‌ఏ పశ్చిమగోదావరి అసోసియేషన్ నూతన కార్యవర్గం

జంగారెడ్డిగూడెం: ఏపీ హెచ్‌ఏఎంఎస్‌ఏ పశ్చిమగోదావరి అసోసియేషన్ ద్వారా వైద్య ఆరోగ్య ఉద్యోగుల, సిబ్బంది అభివృద్ధికి కృషి చేస్తామని రాష్ట్ర అధ్యక్షుడు అరవపాల్ అన్నారు. ఆదివారం ఏపీ హెచ్‌ఏఎంఎస్‌ఏ పశ్చిమగోదావరి అసోసియేషన్ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వి.సౌందర్య, కార్యదర్శిగా ఎస్.సుర్జన్, కోశాధికారిగా కె.కిషోర్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా టి.కుమారి, వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్.సత్యవతి, ఆర్.దుర్గాభవాని, ఎండీ నూర్జహాన్, ఎండీ ఖబీలు జమానా, డి.అనూష, ఉమ్మడి కార్యదర్శులుగా యు.నిర్మలకుమారి, బి.సురేష్, ఎస్.కృష్ణకుమారి, ఎం.వెంకటలక్ష్మి, కాకుల సునీత, ప్రచార కార్యదర్శి వెట్ర పాప, ఆర్గనైజింగ్ సెక్రటరీ కె.వరలక్ష్మి, మహిళా కార్యదర్శి నల్లా కరుణశ్రీ, సభ్యులు పిల్ల సత్యవేణి, కె.రమాదేవిలు నియమితులయ్యారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి వై.శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీ ఎస్.జాన్ హెన్రీ, రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి మంజుల తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల అందజేత



క్రీడాకారులకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేసిన దృశ్యం

జంగారెడ్డిగూడెం: ఏలూరు డిస్ట్రిక్ట్ ఓపెన్ చదరంగం పోటీల్లో జంగారెడ్డిగూడెం శ్రీ హంస చెస్ అకాడమీ పిల్లలు సత్తా చాటారని కోచ్ కన్నా సూర్య నాగేశ్వరరావు తెలిపారు. ఏలూరులో జరిగిన జిల్లా ఓపెన్ చెస్ టోర్నమెంట్‌లో శ్రీ హంస చెస్ అకాడమీ పిల్లలు 11 మంది పాల్గొనగా, ఏడుగురు బహుమతులు సాధించారన్నారు. వారిలో టోర్నమెంట్ నందు ఫస్ట్ ప్లేస్ కన్నా సోనాలి శ్రీమణి కార్తిక, అండర్-7 బాలికల విభాగంలో మొదటి స్థానం వేగేశ్న ఇషిత, ద్వితీయ స్థానంలో కలకోటి దీక్షిత, అండర్ 9 విభాగంలో మొదటి స్థానం వెంపరాల శ్రీ ఆద్య, అండర్ 13 విభాగంలో ద్వితీయ స్థానం మద్దూరి ప్రణవి, అండర్ 11 బాలుర విభాగంలో మొదటి స్థానం కుకునూరి తష్విన్ సాధించారన్నారు. విజేతలకు డైరెక్టర్ ఆర్గనైజర్ లక్ష్మణరావు, సీపీఐ నాయకులు, టోర్నమెంట్ ఆర్బిటర్ దీప్తి బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారని తెలిపారు. ఈ సందర్భంగా విజేతలను కోచ్‌తో పాటు తల్లితండ్రులు, పలువురు ప్రముఖులు అభినందించారు.

ఉగ్రదాడులపై నిరసనల వెల్లువ



కొయ్యలగూడెం: కన్నాపురం జుమా మస్జిద్ వద్ద ముస్లింల నిరసన



జంగారెడ్డిగూడెం: వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ

జంగారెడ్డిగూడెం: పహల్గాం ఉగ్రదాడికి నిరసనగా జంగారెడ్డిగూడెంలో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం నిరసన ర్యాలీ నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి పట్టణంలోని ప్రధాన వీధుల్లో ఈ ర్యాలీ సాగింది. పహల్గాం మృతులకు నివాళి అర్పించారు. అమాయకులను చంపిన ఉగ్రవాదులను వెంటనే మట్టుబెట్టాలని నినదించారు. కార్యక్రమంలో సిటీకేబుల్ ఎండీ పాలకుర్తి శ్రీనివాస్, వాకర్స్ క్లబ్ ప్రెసిడెంట్ ధనరాజు, సెక్రటరీ భీమేశ్వరరావు, జాయింట్ ట్రెజరర్ మందపల్లి అయ్యన్న, పీడీ నరసింహరాజు, వాస సత్యనారాయణ, అల్లూరి సీతారామరాజు మున్సిపల్ పార్కు వాకర్స్‌క్లబ్ సభ్యులు, కాలేజ్ వాకర్స్‌క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఉగ్రమూకలను కఠినంగా శిక్షించాలి

ఉగ్రమూకలపై భారత ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని ఎంబీ సోషల్ క్లబ్ సభ్యులు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక ఎంబీ సోషల్ క్లబ్‌లో ఆదివారం పహల్గాం దాడిని ఖండిస్తూ, ప్రభుత్వానికి సంఘీభావం తెలియజేస్తూ సమావేశం నిర్వహించారు. ఉగ్రదాడి మృతులకు సంతాపంగా సభ్యులు 2 నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఇళ్ల చంటి, చిట్రోజు తాతాజీ, పట్టణ ప్రముఖులు, క్లబ్ సభ్యులు ఎంఎస్ఆర్, జెట్టి గురునాధరావు, మొగళ్లపు వెంకటేశ్వరరావు, కాసర నర్సిరెడ్డి, అయ్యపరావు, పద్మారావు, పకీరు నాయుడు, టీఎస్ఎన్ మూర్తి, రాజారావు, రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

పహల్గాం మృతులకు నివాళి

కొయ్యలగూడెం: పహల్గాంలో ప్రాణాలు కోల్పోయిన మృతులకు కన్నాపురం జుమా మసీదు నివాళులర్పించింది. టెర్రరిస్టు దాడులు పిరికిపంద చర్య అని, భారత సైన్యంతో నేరుగా పోరాడే శక్తి లేక పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు అమాయకులైన ప్రజల ప్రాణాలు తీస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. భారతదేశంలో ప్రతి ముస్లిం ఈ దాడులను ఖండించాలని, టెర్రరిస్టులను ఏరివేయడంతో పాటు పాక్ ఆక్రమిత కాశ్మీర్‌ను స్వాధీనం చేసుకోవడానికి ఇదే సరైన సమయం అని మత పెద్దలు పిలుపునిచ్చారు.

హమాలీలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి



మేడే గోడ పత్రికలను ఆవిష్కరిస్తున్న ఇఫ్టూ నాయకులు

జంగారెడ్డిగూడెం: హమాలీలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఐఎఫ్‌టీయూ డివిజన్ ప్రధాన కార్యదర్శి మంచిలి రాజు డిమాండ్ చేశారు. మే డే సందర్భంగా ఇఫ్టూ రాష్ట్ర కమిటీ ప్రచురించిన గోడ ప్రతులను ఆదివారం మార్కెట్ యార్డ్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ దేశ అభివృద్ధిలో కీలకంగా ఉన్న హమాలీ, భవన నిర్మాణ కార్మికులు తదితర అసంఘటిత కార్మికులకు ఎటువంటి చట్టబద్ధ సౌకర్యాలు లేవని అన్నారు. గతంలో పార్లమెంట్‌లో ఆనాటి కార్మిక శాఖ సహాయ మంత్రి బండారు దత్తాత్రేయ హమాలీలకు పీఎఫ్, ఈఎస్ఐ, పని భద్రత కూడా చట్టం చేస్తానని హామీ ఇచ్చారని, నేటికీ ఆ హామీని ఏ ప్రభుత్వం నిలబెట్టుకోలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పోడిదోలు దుర్గారావు, ముప్పిడి అబ్బులు, గంపల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రంలో మాంసం విక్రయాలు

- దుకాణం ఏర్పాటుపై గ్రామస్తుల ఆగ్రహం
- పంచాయతీ అధికారుల తీరుపై మండిపాటు



బీఎస్ఎన్ఎల్ కార్యాలయం గేటు వద్ద మాంసం విక్రయాలు సాగిస్తున్న వ్యాపారి

ద్వారకాతిరుమల: నిబంధనలకు విరుద్ధంగా శ్రీవారి క్షేత్రమైన ద్వారకాతిరుమల గ్రామంలో మాంసం దుకాణం ఏర్పాటు చేయడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. ద్వారకాతిరుమల క్షేత్ర పవిత్రత, భక్తుల మనోభావాలను దృష్టిలో పెట్టుకుని గతంలో స్థానిక పంచాయతీ అధికారులు మాంసం దుకాణాలను సంతమార్కెట్‌లోనే నిర్వహించుకోవాలని వ్యాపారులకు సూచించారు. అప్పట్లో కొద్దిరోజుల పాటు మార్కెట్‌లోనే జరిగిన వ్యాపారాలు, నెమ్మదిగా రోడ్డుమీదకు చేరాయి. గ్రామ శివారులోనే ఉన్నాయి కదా.. అన్న ఉద్దేశంతో ఎవరూ వాటిని పట్టించుకోలేదు. ఆదివారం ఒక వ్యాపారి ఏకంగా బీఎస్ఎన్ఎల్ కార్యాలయం గేటు వద్ద మాంసం విక్రయాలను సాగించాడు. ఇది సరికాదని ఎంతమంది చెప్పినా ఆ వ్యాపారి వినలేదు. పంచాయతీ అధికారులు, సిబ్బంది తమకేమీ పట్టనట్టు వ్యవహరించిన తీరుపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. క్షేత్ర పవిత్రతకు ముప్పు కలిగించే వ్యాపారులపై తగు చర్యలు తీసుకోవాలని అధికారులను కోరుతున్నారు. ఇదిలా ఉంటే మిగిలిన వ్యాపారులు పోటీగా తమ దుకాణాలను గ్రామంలో ఏర్పాటు చేస్తామని అంటున్నారు.

విద్యార్థినులకు సత్కారం



విద్యార్థినులకు నగదు బహుమతులు అందజేసిన మానవత సభ్యులు

చింతలపూడి: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రతిభ చూపిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ చింతలపూడి శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. మండలంలో మొదటి మూడు స్థానాలు సాధించిన కె.పూజితకు రూ.5 వేలు, బి సౌమ్యకు రూ.4 వేలు, పి. కారుణ్యకు రూ.3 వేలు అందజేశారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థినులకు సన్మానం చేసి నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మానవత సంస్థ సభ్యులు డా ఎ సత్యనారాయణ, సీహెచ్ దుర్గాప్రసాద్, పి సోమశేఖరాచార్యులు, బీవీఎస్ఎన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లు రద్దుచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

కుక్కునూరు: కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్ డిమాండ్ చేశారు. ఆదివారం సీఐటీయూ ఆధ్వర్యంలో పాతదాచారం గ్రామంలో డివిజన్ స్థాయి శిక్షణా తరగతులను ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రసాద్ మాట్లాడుతూ బ్రిటిష్ కాలంలో పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మిక వర్గానికి తీవ్ర అనాయ్యం చేయాలని చూస్తుందని విమర్శించారు. కార్మిక వ్యతిరేక చట్టాలను నిరసిస్తూ మే 20వ తేదీన దేశవ్యాప్తంగా నిర్వహించే సమ్మెలో కార్మికులు, రైతులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్, వై నాగేంద్రరావు, ఉపాధ్యక్షుడు షేక్ వలీపాషా, తిరోజుల సురేష్, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

కార్మికులు ఉద్యమించాలి

బుట్టాయగూడెం: కార్మికులను కట్టుబానిసలుగా చేసే లేబర్ కోడ్‌కు వ్యతిరేకంగా కార్మికులు ఉద్యమించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి కేవీ రమణ పిలుపునిచ్చారు. కేఆర్‌పురం జీసీసీ గోడౌన్ వద్ద సివిల్ సప్లయి హమాలీ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోస్టర్‌ను విడుదల చేశారు. రమణ మాట్లాడుతూ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ స్కీమ్ వర్కర్లను రెగ్యులర్ చేయాలని, హమాలీలకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని, కనీస వేతనం రూ.26 వేలు నిర్ణయించాలని డిమాండ్ చేశారు. హమాలీల నాయకులు రాజేష్, కోర్సా కిషోర్, చందు, తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన తరగతులకు వేదికలుగా..



భీమడోలు లైబ్రరీలో వేసవి విజ్ఞాన తరగతులపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

భీమడోలు: వేసవి సెలవుల్లో చిన్నారులకు పుస్తక పఠనం, విజ్ఞానం పెంపొందించేందుకు గ్రంథాలయాలు వేదికలు కానున్నాయి. గ్రామ, పట్టణ ప్రాంతాల్లోని అన్ని శాఖల్లో ఈ నెల 28వ తేదీ నుంచి జూన్ 6వ తేదీ వరకు 40 రోజుల పాటు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళికలను రూపొందించారు. 10 నుంచి 15 ఏళ్లలోపు బాలబాలికలు సద్వినియోగం చేసుకునేలా అధికారులు కార్యాచరణ సిద్ధం చేశారు. నిత్యం పాఠ్యపుస్తకాలతో కుస్తీ పడుతూ ఏడాదింతా కష్టపడిన విద్యార్థులకు పరీక్షల అనంతరం వేసవి విరామం లభించడంతో ఆనందానికి అవధులుండవు. సెలవుల్లో చిన్నారులకు విజ్ఞానదాయకమైన అంశాలను నేర్పించేందుకు గ్రంథాలయాల్లో ఉచిత శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్నారు. ఆటలు, పాటలు, కథలు వినడం, చదవడం ఇలా విభిన్న అంశాలపై అయా గ్రంథాలయల్లో శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. ఆయా అంశాల్లో అనుభవజ్ఞులైన రిసోర్స్ పర్సన్లతో పిల్లలకు తర్ఫీదును అందిస్తారు.

ప్రతి వారం చర్చా.. సమీక్ష

పఠనం, సరదా అనే విభాగాల్లో శిక్షణ ఉంటుంది. కథలు వినడం, చెప్పడం, గ్రంథాలయాల్లోని పుస్తకాలు చదివి సమీక్షలు రాయడం, స్పోకెన్ ఇంగ్లీషు, చిత్రలేఖనం, పేపర్ కాఫ్ట్స్, నృత్యం, చదరరంగం, కేరమ్స్ తదితర వాటిపై శిక్షణ ఇవ్వనున్నారు. ఆయా కార్యక్రమాలపై ప్రతి వారం చర్చా సమీక్షలు నిర్వహిస్తారు. ఈ శిక్షణ తరగతుల ద్వారా గ్రంథాలయాలకు వచ్చే పాఠకుల సంఖ్య గణనీయంగా పెరుగుతుందని పలువురు చెబుతున్నారు.

శిక్షణ తరగతులు ఇలా..

ఉంగుటూరు నియోజకవర్గంలోని భీమడోలు, ఉంగుటూరు, నిడమర్రు, గణపవరం మండలాల పరిధిలో ఏడు శాఖా గ్రంథాలయాలున్నాయి. వాటిలో శిక్షణ తరగతులు నిర్వహించేందుకు గ్రంథపాలకులు అన్ని ఏర్పాట్లు చేశారు.

ప్రత్యేక తరగతుల సమయం ఇలా

- ఉదయం 8 నుంచి 8.30 గంటల వరకు కథలు వినడం
- 8.30 నుంచి 10 గంటల వరకు పుస్తక పఠనం
- 10 నుంచి 10.30 గంటలకు పుస్తక సమీక్ష
- 10.30 నుంచి 11 గంటల వరకు స్పోకెన్ ఇంగ్లీషు, చిత్రలేఖనం, పెయింటింగ్, పేపర్ క్రాఫ్ట్స్, నృత్యాలు, పప్పెట్ మేకింగ్, చెస్, క్యారమ్స్, క్విజ్, జీకే, ఇతర నైపుణ్య శిక్షణలు